ఓటరమ్మలే అధికం!

• నియోజకవర్గంలో పెరిగిన మహిళా ఓటర్లు • మొత్తం ఓటర్ల సంఖ్య 2,76,928

మంగళగిరి: నియోజకవర్గంలో ఓటర్లు అధికంగా ఉన్నట్లు ఓటర్ల జాబితా వెల్లడించింది. ఓటర్ల జాబితా సవరణలో మంగళగిరి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,76,928 మందికి చేరింది. ఈ ఏడాది జనవరి 5వ తేదీ నాటికి ప్రకటించిన ఓటర్ల జాబితా సమాచారం మేరకు మంగళగిరి శాసనసభా స్థానంలో 2,76,928 మంది ఓటర్లు ఉన్నారు. అనంతరం ఎన్నికల సంఘం సంక్షిప్త సవరణ చేపట్టింది. తిరిగి ఓటర్ల నమోదు, ఓటర్ల గుర్తింపు కార్డుకు ఆధార్ అను సంధానం నిర్వహించింది. దీని ఆధారంగా నియోజకవర్గ ఓటర్లు 2,76,928 ప్రకటించారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం నియోజవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది.

పురుషులకంటే 11912 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు 1,32,496 ఉండగా 1,44,408 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 24 మంది ఉన్నారు. ఒకరు ఒకే ఓటు కలిగి ఉండే విధంగా ఎన్నికల సంఘం జాబితాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంది. ఫొటో సిమిలర్ ఎంట్రీ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు కలిగి ఉన్నట్లు తెలిస్తే సంబంధిత వ్యక్తులతో మాట్లాడి వారికి ఓటు ఎక్కడ కావాలో తెలుసుకుని మరోచోట ఉన్న ఓటును తొలగించారు. నూతనంగా చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను నమోదు చేశారు. మృతి చెందిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారిని తొలగించారు. దీంతో నేటికి 2,76,928 నికరంగా తేల్చారు. నగరంతో పాటు దుగ్గిరాల మండలంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.





నగరపాలక సంస్థ కార్యాలయం

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
మంగళగిరి	77	34,719	37,389	6	72,114
మంగళగిరి టౌన్	59	30,667	33,032	8	63,707
తాడేపల్లి మండలం	40	19,303	23,268	2	42,573
తాడేపల్లి టౌన్	47	23,481	24,921	2	48,404
దుగ్గిరాల	58	24,326	25,798	6	50,130
మొత్తం	281	1,32,496	1,44,408	24	2,76,928

ప్రతిపక్షాల దుష్ప్రచారానికి పింఛన్లే చెంపపెట్టు

- ముఖ్యమంత్రి చొరవతోనే నియోజకవర్గ అభివృద్ధి
- ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు చేసినా ప్రజలు జగనన్న వెంటే
- పింఛన్ల పంపిణీ సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలకు పింఛన్లు పెంపుచేసి పేదలకు అందించడమే చెంపపెట్టు అని తాడికొండ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెంచిన రూ.2750 పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్షాలు ఇటీవల నోటీసులిచ్చి, పింఛన్లు తొలగిస్తున్నారంటూ లబ్ధిదారుల్లో భయాందోళనలు సృష్టించేందుకు చేసిన యత్నాలు వచ్చి అబద్ధాలని నిజమైన లబ్ధిదారులే చెబుతుండటం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తాడికొండ మండలంలో మొత్తం 10238 మంది లబ్ధిదారులకు రూ.2.8 కోట్ల పింఛన్లు పంపిణీ చేయగా మండలంలో అదనంగా అర్హత ఉన్న 294 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అర్హత ఉన్న ప్రతి పేదవాడికి కులం, మతం, ప్రాంతం, పార్టీ బేధం లేకుండా అందజేస్తున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, విమర్శలు చేసినా ప్రజలు జగనన్నకే మద్దతు పలుకుతున్నారని, పేదరికం రూపుమాపడానికే సీఎం నిస్వార్థంతో సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లు పూర్తి చేశామని, ఇంత శ్రద్ధతో పనులు చేస్తున్న జగనన్నకు ప్రజలు అన్ని విధాలా అండగా నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోళ్ళ గణేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకట రెడ్డి, ముక్కామల సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఫణీంద్ర బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో బిక్కి మహేష్ బాబు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరికీ పారిశుద్ధ్యంపై అవగాహన అవసరమని సర్పంచ్ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో శనివారం ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి జీవీఆర్‌కే మూర్తి మాట్లాడుతూ స్థానికులు ఇంటి చుట్టుప్రక్కల పరిసరాల్లో మురుగు నిలువకుండా చూసుకోవాలని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బందితో పూడికతీత పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా బ్రహ్మంగారి గుడి, అంకమ్మ బావి, బొడ్రాయిసెంటర్ ప్రాంతాల్లో కాలువలు పూర్తిగా పూడుకుపోయి నీరు నిలిచి పోతుండటంతో పొక్లయినర్‌తో పనులు చేస్తున్నట్లు తెలిపారు.

అనధికార చీటీల నిర్వహణతో కుచ్చుటోపీ

బాధితుడి ఫిర్యాదుతో అరెస్ట్

మంగళగిరి: అనధికారికంగా చీటీలు వేసి పాటదారులకు నగదు చెల్లించకపోవడంతో బాధితుల ఫిర్యాదుతో గుంటూరు జిల్లా మంగళగిరి నియోజవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ ఆరుద్ర భూలక్ష్మి మరిది ఆరుద్ర సత్యంను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడు శ్రీకాకుళం వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరబాబు సత్యం వద్ద రూ.20 లక్షల చీటీ వేయగా పాడిన అనంతరం నాలుగు సంవత్సరాలైనా ఇప్పటి వరకు మరో రూ.6 లక్షలు చెల్లించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సత్యంను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన రూరల్ ఎస్‌ఐ



మంగళగిరి: రూరల్ ఎస్ఐగా రమేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రమేష్‌బాబు మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన ఎస్ఐ మహేష్‌ను ప్రకాశం జిల్లాకు అధికారులు బదిలీ చేశారు. ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌బాబుకు పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు వాసవీ మాత ఆలయంలో శిలాఫలకం ఆవిష్కరణ

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్రేన్ సంస్థల అధినేత జి.వి.ఎస్.ఎల్. కాంతారావు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి, 108 ముత్తయిదువులకు పసుపుకుంకుమ అందిస్తారని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని నరసింహారావు కోరారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి 12 వరకు 176వ సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ సహాయ కార్యదర్శులు ఎస్. గిరిజాశంకర్, వి. కృష్ణ కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 9 గంటలకు ప్రారంభ సభ, సాయంత్రం 6 గంటల నుంచి గాత్ర కచేరి, 9న వయోలిన్ కచేరి, 10న గాత్ర కచేరి, 11న గాత్ర కచేరి, 12న ఉదయం శ్రీ త్యాగరాజస్వామికి అభిషేకార్చనలు, పంచరత్న సేవ విశేషంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఆంజనేయ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమాల్లో కళాకారులు, సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్లు

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- ఎమ్మెల్సీ మురుగుడుతో కలసి చినకాకాని అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన

మంగళగిరి: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. నగర పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి వెంబడి రూ.1.30 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టి తుదిదశకు చేరుకున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావుతో కలసి ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగర పరిధిలో చేపట్టిన 9 అర్బన్ హెల్త్ సెంటర్లలో ఇప్పటికే ఏడు సెంటర్లను ప్రారంభించి రోగులకు సేవలు అందించడం జరుగుతోందని, మిగిలిన రెండు సెంటర్లను కొద్ది రోజుల్లో ప్రారంభించి నగర ప్రజలకు పూర్తిస్థాయిలో ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఏడుగురు సిబ్బందిని నియమించగా ప్రత్యేకంగా వారంలో మూడు రోజులు ప్రత్యేక విభాగాల వైద్యులు అర్బన్ హెల్త్ సెంటర్‌కు చేరుకుని అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరుగుతుందన్నారు. చినకాకాని అర్బన్ హెల్త్ సెంటర్‌ను మరో వారం రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ రమేష్ పాల్గొన్నారు.


తుదిదశకు చేరుకున్న చినకాకాని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

మేడికొండూరు: మండలంలోని సిరిపురం గ్రామంలో మహిళ సంఘ సభ్యులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని వివిధ డ్వాక్రా గ్రూపు మహిళా సంఘాల సభ్యులతో తమ ఇంటి ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులను కలిసి రబీలో అందరూ 18 రకాల విత్తనాలు బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకుని చల్లుకుంటే 40 రోజుల తరువాత కలయ దున్నితే భూమి సారవంతమవుతోందన్నారు. భూమిలో పోషకాలు ఉంటాయన్నారు. అభివృద్ధి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ద్వారా మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ రామకృష్ణ, ఎల్2 తిరుపతిరావు, వాణి, మేరి, మహిళ సంఘ సభ్యులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసంపై అవగాహన

మేడికొండూరు: ప్రతి విద్యార్థి భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకుంటే జీవితంలో మంచి ఉన్నత స్థానం సాధించేలా మంచి లక్ష్యం కలిగి ఉండాలని అమెరికాకు చెందిన హెచ్‌బీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీదేవి అన్నారు. మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మానసిక వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత భావోద్వేగాల నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. మనస్సులో పుట్టే ప్రతి ఆలోచనను ఒక్క క్షణం ఆలోచించి మంచి చెడులతో పరిశీలన చేసుకుని మంచి ఆలోచన వైపు నడవాలన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులైనా ఎదుర్కొని మనోధైర్యాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. సమస్యలు మానవ జీవితంలో ఒక భాగమని, పరిస్థితిని బట్టి ఆలోచనా విధానం మార్చుకుంటూ ఉన్నతంగా ఉండే విధానాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో ఉండే ప్రతి సమయం విలువైందన్నారు. వాటిని గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థి టెన్షన్, రిలీఫ్‌కు ధ్యానం, యోగ క్రమం తప్పకుండా చేయాలన్నారు. మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు, ఏఓ బి.సీతారామయ్య, పి.రవికుమార్, డాక్టర్ చంద్రమౌళి, రెహమాన్, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్‌బీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవిని సన్మానిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన

నగరంపాలెం: వైఎస్సార్ కడప జిల్లాలోని రైల్వే కోడూరులో గత నెల 26, 27 తేదీల్లో కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన 66వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. అండర్ –19 కేటగిరిలో 59–63 కిలోల విభాగాన మైస్పేస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారిణి రాచమల్లు కళాజ్యోత్స్న రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించింది. దీంతో ఆమె జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో కళాజ్యోత్స్నను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, స్టెప్ సీఈఓ వెంకటనారాయణ శనివారం కలెక్టరేట్‌లో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సమన్వయకర్త సునీత, ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచంద్రరావు, అకాడమీ డీన్ అప్పిరెడ్డి, ప్రధాన ఆచార్యులు నిమ్మగడ్డ సురేష్ పాల్గొన్నారు.


కళాజ్యోత్స్నను అభినందిస్తున్న కలెక్టర్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నెహ్రూనగర్: పింఛన్ పెంపుతో అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నూతన సంవత్సర కానుక అందించారని 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 122వ సచివాలయంలో శనివారం పింఛన్‌దారులతో కలసి సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని కొనియాడారు. డివిజన్ పరిధిలో 1100 పైగా పింఛన్లు ఉండగా, కొత్తగా మరో 50 మంజూరయ్యాయని ఆమె చెప్పారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



పాత గుంటూరు: ఆర్.అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో శ్రీ రామనామ సంకీర్తన సంఘం ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శనివారం శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు కల్యాణ విశేషాల్ని విశేషంగా పాల్గొన్న భక్తులకు వివరిస్తూ, కల్యాణాన్ని నిర్వహించారు. విశేష హారతి, మంత్ర పుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం హనుమాన్ చాలీసా అష్టోత్తర శత పర్యాయాల పారాయణ కార్యక్రమాన్ని కోగంటి వెంకట శ్రీరంగనాయకి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణ సర్వ కార్య జయం, ధైర్యం కలిగిస్తాయని తెలిపారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు మహా హారతి అనంతరం తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సభ్యుడు పుట్టగుంట ప్రభాకర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు పర్యవేక్షించారు.


కార్యక్రమంలో పాల్గొన్న మస్తానయ్య, భక్తులు

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య పనివారల సంఘం (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ సంస్థ) క్యాలెండర్‌ను తన చాంబర్‌లో శనివారం మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని తన దృష్టికి తెస్తే, వెంటనే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు బోడపాటి కిశోర్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ అంజిరెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, యూనియన్ నాయకులు బత్తుల మరియన్న, భూపతి నాంచారయ్య, భజంత్రి రమణ, భీమవరపు రమణ, భజంత్రి శ్రీను, భూపతి సాంబశివరావు, గాలిముత్తం ఆదాం, పెదాల కృష్ణ, నక్కా నాంచారయ్య పాల్గొన్నారు.

14న గోదాదేవి, రంగనాయకుల కల్యాణం


కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 14న భోగి పండుగ సందర్భంగా ఉదయం 10 గంటలకు 108 మంది కన్యలతో శ్రీ గోదాదేవి రంగనాయకులస్వామికి కూడరై పూజ, శ్రీ గోదాదేవి రంగనాయకుల స్వామి తిరు కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు పూజల్లో పాల్గొనే కన్యలకు అందించే 108 పాయసం గిన్నెలను సామాజిక సేవకుడు ఆకుల ఏడుకొండలు శనివారం ఆలయానికి అందించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జయప్రకాశ్‌రెడ్డి, ధరకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ మహాసభ

పట్నంబజారు: అర్చక, బ్రాహ్మణ సమస్యల పరిష్కార సాధనకు ఆదివారం బ్రాహ్మణ ప్రతినిధుల మహాసభ జరగనున్నట్లు 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), బ్రాహ్మణ నేత టి. విజయకృష్ణ చెప్పారు. బ్రాడీపేటలోని వారి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సభ జరుగుతుందని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, ఆయన వారసుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే బ్రాహ్మణులకు ప్రథమ ప్రాధాన్యతిచ్చారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణుల్ని అవమానాలు, వేధింపులకు గురి చేసిందని ఆరోపించారు. ఆదివారం సభకు ప్రజాప్రతినిధులు, పలువురు బ్రాహ్మణ ముఖ్య నేతలు హాజరుకానున్నట్లు చెప్పారు. సభకు బ్రాహ్మణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బార్ ఏర్పాటును నిలిపివేయాలి

ముస్లిం ఐక్యవేదిక నాయకుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

పాత గుంటూరు: తూర్పు నియోజకవర్గంలోని పొన్నూరు రోడ్డులో కనక దుర్గమ్మ గుడి, మసీదు, కళాశాల, ఇండియన్ బ్యాంకు, అంజుమన్ స్కూలు, నివాసాలున్న ప్రాంతంలో బార్ ఏర్పాటును ముస్లిం ఐక్యవేదిక నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ జియావుర్ రహమాన్ మాట్లాడుతూ ఇళ్ల మధ్య బార్ ఏర్పాటుకు నిర్వాహకులు లైసెన్స్ కోరితే వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బార్ ఏర్పాటు చేయవద్దని స్థానికులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పాత గుంటూరు సీఐ వాసు ఘటన స్థలానికి చేరుకుని వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర జనరల్ సెక్రెటరీ హాజీ అబ్దుల్ కలాం, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బాజీ, సలీం, సభ్యులు అన్సారి, అల్లాబక్షు, మహిళలు పాల్గొన్నారు.